సాక్షి విశాఖపట్నం

శుక్రవారం : 29 : మార్చి : 2024



వైఎస్సార్‌సీపీలో చేరికలు

వైఎస్సార్‌సీపీలో విశాఖ దక్షిణ నుంచి జనసేన, విశాఖ తూర్పు నుంచి కాంగ్రెస్ నాయకులు భారీగా చేరారు. IIలో



మార్మోగిన వేదమంత్రాలు

సింహగిరిపై శ్రీ సుదర్శన నారసింహ మహాయజ్ఞం రెండవ రోజు గురువారం వైభవంగా కొనసాగింది. IIలో



ప్రజారోగ్యానికి జవసత్వాలు IIలో

న్యూస్‌రీల్

రూ.10.13 కోట్లకు అప్పన్న తలనీలాల వేలం



వేలం నిర్వహిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: సింహాచలం దేవస్థానంలో భక్తులు సమర్పించిన తలనీలాలకు గురువారం వేలం నిర్వహించారు. 2024–25 సంవత్సరానికి గాను రూ.10 కోట్ల 13 లక్షల ఆదాయం లభించింది. తమిళనాడుకు చెందిన దొరై ఎంటర్‌ప్రైజస్ హెచ్చుమొత్తానికి వేలం సొంతం చేసుకుంది. సీల్డ్ టెండర్లు 8 మంది దాఖలు చేయగా అందులో కూడా దొరై ఎంటర్‌ప్రైజస్ 9కోట్ల 61లక్షల 40వేల హెచ్చుమొత్తానికి కోడ్ చేసింది. అలాగే ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా గరుడ ఎంటర్‌ప్రైజస్ 8కోట్ల 28లక్షల 99వేల 999 కోడ్ చేసింది. బహిరంగ వేలం ద్వారా వచ్చిన రూ.10 కోట్ల 13లక్షలు హెచ్చు పాటని ఖరారు చేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ఏఈవో పాలూరి నరసింగరావు, ఏఈ రాంబాబు, సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి తదితరులు వేలం నిర్వహించారు.

ఐఐఎం విశాఖలో సీఆర్‌ఎంఈ ప్రారంభం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఐఐఎంవీ డైరెక్టర్ చంద్రశేఖర్ తదితరులు

ఏయూక్యాంపస్: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం ప్రాంగణంలో సెంటర్ ఫర్ రెస్పాన్స్‌బుల్ మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్‌ను గురువారం ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని ఏకం ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ అమిత్ చటర్జీ, ఆచార్య బి.చక్రవర్తి, విర్భాద్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ డి.శ్రీ ప్రసాద్, ఐఐఎం సంచాలకులు ఆచార్య ఎం.చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏకం ఫౌండేషన్ ట్రస్టీ అమిత్ చటర్జీ మాట్లాడుతూ బాధ్యత కలిగిన మేనేజర్లను తయారు చేస్తే మంచి నాయకులుగా నిలుస్తారన్నారు. విర్భాద్ ఎండీ శ్రీ ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వర్గాలకు ఉపయుక్తంగా నిలిచే సూచనలు అందిస్తూ వారికి తోడ్పాటును అందించే విధంగా కేంద్రం నిలవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఆచార్య చంద్రశేఖర్ మాట్లాడుతూ పర్యావరణం, సామాజిక, పరిపాలన నిర్ణయాలను మేనేజ్‌మెంట్ విద్యలో భాగం చేస్తుందన్నారు. కేంద్రం అధిపతి ఆచార్య అమిత్ చక్రవర్తి తదితరులు ప్రసంగించారు.

ముగిసిన పది పరీక్షలు



పరీక్షలు పూర్తయిన జోష్‌లో విద్యార్థినులు

విశాఖ విద్య: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. గురువారం సంస్కృతం పరీక్ష (ఓఎస్ఎస్‌సీ) 120 కేంద్రాల్లో నిర్వహించగా 5,683 మంది హాజరైనట్లు డీఈవో చంద్రకళ తెలిపారు. పరీక్ష పూర్తి చేసుకున్న అనంతరం కేంద్రాల వద్ద విద్యార్థుల సందడి కనిపించింది. తోటి స్నేహితులతో ఆనందంగా గడిపారు. పదో తరగతి చదువులకు గుర్తుకు సెల్ఫీలను తీసుకున్నారు.

హైకోర్టు న్యాయమూర్తి రాక నేడు

మహారాణిపేట: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీనివాస్ శుక్రవారం విశాఖ వస్తున్నారు. మధ్యాహ్నం 1.50 గంటలకు వందేభారత్ రైలులో చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు వెళతారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనం కోసం మధ్యాహ్నం 3.30 గంటలకు బయలుదేరుతారు. దర్శన అనంతరం తిరిగి సర్క్యూట్ హౌస్‌కు చేరుకుంటారు. రాత్రికి అక్కడే బస చేస్తారు.

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్ ఈ నెల 30న విశాఖ వస్తున్నారు. అన్నవరం నుంచి రోడ్డు మార్గంలో ఉదయం 8.30 గంటలకు ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకుంటారు. అనంతరం జిల్లా కోర్టులో జరిగే వర్క్‌షాపులో పాల్గొంటారు.

3,497 మందికి వైద్య సేవలు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా గురువారం బక్కన్నపాలెం (రిక్షా కాలనీ), తోటగరువు, విద్యానగర్, పాత వెంకోజీపాలెం, రంగిరీజువీధి, జబ్బరితోట, శివానగర్, ఇందిరా నగర్, కణితి, గాజువాక, నరసింహనగర్‌లో జరిగిన శిబిరాలను డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు పరిశీలించారు. ఈ శిబిరాల్లో మొత్తం 3,497 మందికి వైద్య సేవలందించారు. ఇందులో 19 మందిని ఉన్నత వైద్యం కోసం ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రులకు సిఫారసు చేశారు. శుక్రవారం సెలవు అని, శనివారం పద్మనాభం మండలం గంధవరంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో వెల్లడించారు.

మనసున్న మారాజు



తుపానుకు ఫిషింగ్ హార్బర్‌లో మునిగిపోయిన బోటు



- టీడీపీ హయాంలో మునిగిన, కాలిన బోట్లకు సాయం
- ఇలాంటి 36 బోట్లకు రూ.1.35 కోట్ల పరిహారం
- ఈనెల 16న నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- ఈసీ నుంచి అనుమతి రాగానే పంపిణీకి సన్నద్ధం
- సీఎం జగన్ రుణం తీర్చుకుంటామంటున్న మత్స్యకారులు

సాక్షి, విశాఖపట్నం : మత్స్యకారులపై మమకారంతో ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి పట్ల మరోసారి ఉదారతను చాటుకున్నారు. ఇప్పటికే మత్స్యకారుల సంక్షేమానికి పలు పథకాలు ప్రవేశపెట్టి వారికి అండగా నిలిచారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.10 వేల భృతి, లీటర్‌పై రూ.9 డీజిల్ సబ్సిడీ, 50 ఏళ్లకే పెన్షను, వేట సమయంలో ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షల పరిహారం వంటి పలు ప్రయోజనాలను చేకూరుస్తున్నారు. వారికి ఏ కష్టం వచ్చినా వెంటనే ఆదుకుంటున్నారు. గత నవంబర్ 19 అర్ధరాత్రి ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 49 బోట్లు దగ్ధమైన సంగతి తెలిసిందే. **బాధిత బోటు యజమానులకు మూడు** రోజుల్లోనే భారీ మొత్తంలో రూ.7.11 కోట్ల పరిహారాన్ని అందజేశారు. ఈ బోట్లపై ఆధారపడ్డ కలాసీలు 400 మంది జీవనోపాధి కోసం ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున చెల్లించారు. ఊహించిన దానికంటే ఎక్కువ పరిహారాన్ని అందించడంపై బాధిత మత్స్యకారులు ఎంతగానో ఉబ్బితబ్బిబ్బయ్యారు. తమకు ఈ మేళ్లన్నీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాకే జరుగుతున్నాయన్న ఆనందంలో ఉన్నారు.

మత్స్యకారులపై మమకారం

గత టీడీపీ ప్రభుత్వం హయాంలో సముద్రంలో మత్స్యకారుల బోట్లు కాలిపోయినా, మునిగిపోయినా, తుపాన్లలో దెబ్బతిన్నా పరిహారం సక్రమంగా ఇచ్చేవారు కాదు. ఇచ్చే అరకొర సాయం కూడా ఏళ్ల తరబడి కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అందుకు భిన్నంగా మత్స్యకారులపై అభిమానాన్ని చాటుకుంటున్నారు. వారికొచ్చే కష్టాలపై తక్షణమే స్పందించి ఉదారంగా సాయమందిస్తున్నారు. టీడీపీ హయాంలో మునిగిన, అగ్ని ప్రమాదానికి గురైన, తుపాన్లలో దెబ్బతిన్న బోట్లకు కూడా పరిహారం అందించేలా చూడాలని బాధిత మత్స్యకారులు తాజా మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను కోరారు. దీనిపై ఆయన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. స్పందించిన సీఎం బాధిత మత్స్యకారులకు పరిహారం చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు వివిధ ప్రమాద ఘటనల్లో దెబ్బతిన్న 36 బోట్లకు రూ.1.35 కోట్ల నిధులు విడుదల చేస్తూ మత్స్యశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ ఈనెల 16న ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈ నిధులు జిల్లా కలెక్టర్ అకౌంట్‌లో జమయ్యాయి.

దెబ్బతిన్న బోట్లు

2014-2019 మధ్య కాలంలో మొత్తం 36 బోట్లు దెబ్బతిన్నాయి. వీటిలో 21 బోట్లు సముద్రంలో మునిగిపోగా, నాలుగు అగ్ని ప్రమాదానికి గురయ్యాయి. ఐదు నీటి అడుగున చిక్కుకుపోయాయి. మరో ఆరు బోట్లు ఫిషింగ్ హార్బర్‌లో ప్రమాదాల పాలై పాక్షికంగా నష్టం వాటిల్లింది. ఇందులో 2014 హుద్‌హుద్ తుపానుకు మునిగిపోయిన రెండు బోట్లకు, 2018 తిత్లీ తుపానులో మునిగిన మూడు బోట్లకు, 2019 పెథాయ్, జావద్ తుపాన్లకు మునిగిపోయిన 11 బోట్లకు టీడీపీ ప్రభుత్వం పరిహారం చెల్లించలేదు. అప్పుడెప్పుడో టీడీపీ హయాంలో దెబ్బతిన్న బోట్లకు కూడా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాయమందిస్తుండడంపై మనసున్న మారాజు అంటూ సీఎం జగన్‌ను మత్స్యకారులు కొనియాడుతున్నారు. ఆయన రుణం తీర్చుకుంటామని పేర్కొంటున్నారు.

ఈసీ స్క్రీనింగ్ కమిటీకి లేఖ




గతంలో ప్రమాదాలకు గురైన బోట్ల యజమానులకు పరిహారం సొమ్ము పంపిణీకి అనుమతించాలని కోరుతూ ఎన్నికల కమిషన్ స్క్రీనింగ్ కమిటీకి లేఖ రాశాం. అటు నుంచి గ్రీన్‌సిగ్నల్ రాగానే చెల్లింపులు జరుగుతాయి. టీడీపీ హయాంలో ఈ బోట్లకు పరిహారం కోసం ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించి నిధుల విడుదలకు జీవో జారీ చేశారు. సీఎం జగన్ ఉదారతకు కృతజ్ఞతగా మత్స్యకారులు ఆయనకు అండగా ఉంటామని చెబుతున్నారు.

– వాసుపల్లి గణేష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే, విశాఖ దక్షిణ

‘దక్షిణ’ నాదంటే నాదే!

- వంశీకృష్ణకు టికెట్ వట్టిదేనంటున్న కందుల
- తనకే ఇచ్చారని వంశీకృష్ణ ప్రచారం
- మంగళగిరికి చేరిన ఇద్దరి పంచాయతీ
- పవన్‌ను కలిసేందుకు కందుల పయనం
- సీటివ్వకపోతే జనసేనకు గుడ్‌బై చెబుతానని స్పష్టీకరణ



సాక్షి, విశాఖపట్నం: జనసేన విశాఖ దక్షిణ నియోజకవర్గం సీటు రసకందాయంలో పడింది. ఈ టికెట్ నాదంటే నాదని ఇద్దరు నాయకుల మధ్య వార్ జరుగుతోంది. ఈ సీటును కార్పొరేటర్లు సాదిక్, కందుల నాగరాజులతో పాటు మూగి శ్రీనివాస్‌లు ఆది నుంచీ ఆశిస్తున్నారు. తీరా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైఎస్సార్‌సీపీ నుంచి ఫిరాయించి జనసేనలో చేరిన ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ తెరపైకి వచ్చారు. జనసేన అభ్యర్థుల జాబితాల్లో విశాఖ దక్షిణ అభ్యర్థి పేరును ప్రకటించలేదు. అయినా ఈ సీటును తనకే ఖరారు చేశారంటూ వంశీకృష్ణ స్వయంగా ప్రకటించుకుని ఎన్నికల ప్రచారాన్ని కూడా ప్రారంభించేశారు. వంశీ అభ్యర్థిత్వంపై దక్షిణం సీటును ఆశిస్తున్న ఈ ముగ్గురు నేతలూ తీవ్రంగా మండిపడుతున్నారు. ఆ నియోజకవర్గంలో ఆయనకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసనలు చేపడుతున్నారు. ‘వంశీ వద్దు.. స్థానికులే ముద్దు’ అంటూ నినాదాలు చేస్తూ రోడ్డెక్కారు. కొద్దిరోజుల క్రితం ఒక మేకను తీసుకొచ్చి వంశీతో పోలుస్తూ ఈ సీటును బలి చేయొద్దని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఆ సమయంలో వంశీ వర్గీయులు తమ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారంటూ జనసేన మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆ నియోజకవర్గంలో జనసేన రెండు వర్గాలుగా చీలిపోయింది. వంశీ ఎన్నికల ప్రచారానికి వ్యతిరేక వర్గీయులు దూరంగా ఉంటున్నారు. మరోపక్క వంశీకృష్ణకు టికెట్ కేటాయింపు ప్రకటన వట్టిదేనని, అంతా బూటకమని కందుల బహిరంగంగానే చెబుతున్నారు. పవన్ ఆ సీటును తనకే ఖరారు చేస్తున్నారని ప్రచారం చేసుకుంటున్నారు.

మంగళగిరికి కందుల

జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను కలిసి విశాఖ దక్షిణ సీటు తనకే కేటాయించాలని కోరేందుకు కందుల నాగరాజు గురువారం మంగళగిరికి పయనమయ్యారు. వంశీకృష్ణకు సీటిస్తే ఓడిపోతారని, తనకిస్తే గెలుస్తానని చెప్పడానికి వెళ్లారు. సీటు ఇస్తారన్న హామీతోనే గతంలో జనసేనలో చేరానని, ఒకవేళ తనకు టికెట్ కేటాయించకపోతే పార్టీకి గుడ్‌బై చెబుతానని పవన్‌కు స్పష్టం చేయనున్నట్టు ఆయన వర్గీయులు చెబుతున్నారు. మంగళగిరి పంచాయతీలో దక్షిణ టికెట్‌పై ఏం తేలుస్తారోనని జనసేన శ్రేణుల్లో చర్చ జరుగుతోంది.

తహసీల్దార్ హత్య కేసులో నిందితుడికి బెయిల్ తిరస్కరణ

విశాఖ లీగల్: విశాఖ రూరల్ తహసీల్దార్‌గా పనిచేసిన సనపల రమణయ్య హత్య కేసులో ప్రధాన నిందితుడు ఎం.సుబ్రహ్మణ్యం గంగారావు బెయిల్ పిటిషన్‌ను జిల్లా ప్రధాన కోర్టు న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ తిరస్కరించారు. గురువారం ప్రధాన పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు, గంగారావు న్యాయవాది వాదనలు విన్న న్యాయమూర్తి.. కేసు దర్యాప్తు పూర్తి కానందున బెయిల్ మంజూరు చేయవద్దని ప్రాసిక్యూషన్ చెప్పిన వాదనతో ఏకీభవించారు. ఈ సమయంలో బెయిల్ మంజూరు చేయలేమని స్పష్టం చేశారు. పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధి కొమ్మాదిలోని అపార్ట్‌మెంట్ వద్ద గత నెల రెండో తేదీ రాత్రి 10 గంటల సమయంలో రమణయ్యను హత్య చేసిన సంగతి తెలిసిందే..

నిఘా మరింత పటిష్టం

- ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు చురుగ్గా పనిచేయాలి
- కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్



మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ రవిశంకర్

మహారాణిపేట: ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు మరింత చురుగ్గా పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎలక్షన్ సీజర్స్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఈఎస్‌ఎంఎస్) పురోగతిపై గురువారం సంబంధిత అధికారులతో వారు సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఈఎస్‌ఎంఎస్ ద్వారా కేసులు నమోదు చేయడంలో మరింత పురోగతి కనిపించాలని సూచించారు. ఎన్నికల షెడ్యూల్ జారీ నుంచి ఇప్పటివరకు రూ.53.49 లక్షలు మాత్రమే నగదు పట్టుబడిందన్నారు. ఇప్పటివరకు కొన్ని శాఖల నుంచి ఎటువంటి కేసులు నమోదుకాలేదన్నారు. ఈ విషయంలో ఆయా నోడల్ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీ బృందాలు చర్యలు చేపట్టాలన్నారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ, పోర్టు ట్రస్ట్, ఆదాయపు పన్ను, కస్టమ్స్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, రాష్ట్ర జీఎస్టీ అధికారులు నిఘాను మరింత పటిష్టం చేయాలన్నారు. ఇకపై ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు, పోలీసు అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. మరో మూడు వారాల్లో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుందని, ఆ రోజు నుంచి ఎంసీసీ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ మరింత చురుగ్గా పనిచేయాలన్నారు. రాజకీయ పక్షాల సమావేశాలు, ర్యాలీల కోసం సువిధా యాప్‌లో దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లోగా అనుమతులు మంజూరు చేయాల్సి ఉన్నప్పటికీ.. 24 గంటల్లోనే అనుమతి మంజూరు చేసేలా ఆర్వోలు చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్‌లో ఉంచరాదని స్పష్టం చేశారు. పోలింగ్ విధుల్లో పాల్గొనే వారి కోసం పోస్టల్ బ్యాలెట్ ఉందని, ఇందుకోసం ప్రతీ శాఖలో ఓ నోడల్ అధికారిని నియమించామన్నారు. ఆయా నోడల్ అధికారులు కోరిన విధంగా ఫారం–12 లేదా ఫారం–12డీలను సరఫరా చేస్తామన్నారు. ఎంసీసీ జిల్లా నోడల్ అధికారి, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

‘ఉత్తర’ అభివృద్ధికి కేకే రాజు విశేష కృషి

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి
- అట్టహాసంగా పార్టీ ఉత్తర కార్యాలయం ప్రారంభం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి. చిత్రంలో ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, పార్టీ ముఖ్య నేతలు

సీతమ్మధార: ‘గత ఎన్నికల్లో ఉత్తరం నుంచి గెలిచిన టీడీపీ ఎమ్మెల్యే తర్వాత ఒక్కసారి కూడా ప్రజలకు కనిపించలేదు. కానీ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు నిరంతరం ప్రజల్లో ఉండి.. వారి కష్టాల్లో తోడయ్యారు. అందరి బాగోగులు తెలుసుకుని అండగా నిలిచారు. నియోజకవర్గ అభివృద్ధిలో తనదైన ముద్ర వేశారు. కె.కె.రాజుకు ఓటు వేసి గెలిపిస్తే ఉత్తర నియోజకవర్గ ప్రజలకు మరింత జరుగుతుంది.’ అని వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. కె.కె.రాజు ఆధ్వర్యంలో బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన పార్టీ ఉత్తర కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ 2014లో చంద్రబాబు కూటమిగా వచ్చి ప్రజలను మోసం చేశారని, అందుకే 2019లో టీడీపీకి రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. అధికార కాంక్షతో ఈ ఎన్నికల్లో మళ్లీ కూటమిగా ఏర్పడి మభ్యపెట్టేందుకు వస్తున్నారని.. కూటమి కుటిల రాజకీయాలను తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా పేద, మధ్య ప్రజలకు అండగా నిలిచారన్నారు. రాష్ట్రంలో పోర్టులను అభివృద్ధి చేస్తున్నారని, విద్యా వ్యవస్థలో వినూత్న మార్పులు తీసుకొచ్చారన్నారు. అన్ని రంగాలకు పెద్దపీట వేసి సుపరిపాలన అందించారన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి వెనుక కె.కె.రాజు శ్రమ ఎంతో ఉందన్నారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి విశాఖ ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీ, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. బొత్స ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ మన భవిష్యత్ మన చేతుల్లో ఉందని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుందామన్నారు. విశాఖ ఆడపడుచుగా ముఖ్యమంత్రి తనకు అవకాశం కల్పించారని, ఇక్కడ గెలిచి విశాఖ రుణం తీర్చుకుంటానన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో కె.కె.రాజు కృషి ఎంతో ఉందన్నారు. ఇద్దరినీ ఆశీర్వదించాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, ఎస్.ఎ.రెహ్మాన్, చింతపూడి వెంకటరామయ్య, మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, వీఎంఆర్డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి, ఉత్తర ఎన్నికల పరిశీలకులు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఉల్లంఘిస్తే చర్యలే..

- సార్వత్రిక ఎన్నికలకు పటిష్ట భద్రత
- జిల్లా పోలీసులతో పాటు మూడు కేంద్ర బలగాల రాక
- ఎన్నికల నియమావళి పర్యవేక్షణకు ఎంసీసీ బృందాల ఏర్పాటు
- ప్రలోభాల అడ్డుకట్టకు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు

విశాఖ సిటీ: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పోలీస్ శాఖ పకడ్బందీ భద్రతా చర్యలు చేపడుతోంది. నగర పోలీసులతో పాటు ఎన్నికల విధుల కోసం మూడు కేంద్ర బలగాలు జిల్లాకు చేరుకున్నాయి. రెండు సీఐఎస్‌ఎఫ్, ఒక ఆర్పీఎఫ్ నుంచి వచ్చిన బలగాలు ఇప్పటికే నగరంలో మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్నాయి. ఒక్కో నియోజకవర్గానికి ఒక సీనియర్ పోలీస్ అధికారిని నియమించారు. ఆ అధికారి పర్యవేక్షణలో జిల్లా, కేంద్ర పోలీస్ బలగాలు బందోబస్తు నిర్వహించనున్నాయి. ఒక వైపు భద్రతా ఏర్పాట్లతో పాటు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అన్ని శాఖల సమన్వయంతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనల పరిశీలన, పర్యవేక్షణ కోసం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో మూడు, నాలుగు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) బృందాలను నియమించారు. అలాగే ఆకస్మిక తనిఖీల కోసం ప్రత్యేకంగా ఫ్లయింగ్ స్క్వాడ్‌లను సైతం సిద్ధం చేశారు. అలాగే ఎన్నికల నియామావళిని అనుసరించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేలా అందరూ సహకరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ విజ్ఞప్తి చేశారు.

ఉల్లంఘనల పర్యవేక్షణకు ఎంసీసీ బృందాలు

ఒక్కో ఎంసీసీ బృందంలో ఒక ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌గా ఎంపీడీవో, ఆ స్థాయి అధికారితో పాటు ఒక వీడియో గ్రాఫర్, ఒక పోలీస్ అధికారిని నియమించారు. ఒక్కో నియోజకవర్గంలో మూడు నుంచి నాలుగు బృందాలు రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ప్రచారాలు, ఉల్లంఘనలపై దృష్టి సారించనున్నాయి. ఈ ఉల్లంఘనలపై వచ్చిన ఫిర్యాదులపై బృందాలు విచారణ చేపట్టి నివేదికను సమర్పించనున్నాయి.

ఎన్నికల నియమావళి పాటించాల్సిందే

- పోటీ చేసే అభ్యర్థులు, వారి ప్రచారకులు తమ ప్రత్యర్థుల వ్యక్తిగత జీవితంపై ఎటువంటి విమర్శలు చేయకూడదు.
- ఎన్నికల ప్రచార ర్యాలీలు, రోడ్‌షోలు, సమావేశాలు, ఇంటింటి ప్రచారాలు, లౌడ్ స్పీకర్ల వినియోగానికి తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలి.
- ఊరేగింపులలో ఎటువంటి ఆయుధాలు ఉపయోగించకూడదు.
- కుల, మత విభేదాలు, విద్వేషాలను సృష్టించకూడదు.
- ఓటర్లకు మద్యం, డబ్బు, ఇతర బహుమతులు పంపిణీ చేసి ప్రలోభాలకు గురిచేయకూడదు.
- పోలింగ్ రోజున అన్ని పార్టీల అభ్యర్థులు పోలింగ్ డ్యూటీ అధికారులతో సహకరించాలి.
- పోలింగ్ కేంద్రాల్లో ప్రచారాలు చేయకూడదు. పార్టీల చిహ్నాలు ప్రదర్శించకూడదు.
- ప్రత్యర్థి పార్టీ పోస్టర్లను తొలగించకూడదు.

ప్రత్యేక తనిఖీ బృందాలు

జిల్లాలో 5 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్(ఎస్ఎస్‌టీ) పనిచేస్తున్నాయి. గతంలో బోర్డర్ చెక్‌పోస్టులుగా పరిగణించిన వాటిని ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఎస్ఎస్‌టీగా మార్చారు. వీటితో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్స్(ఎఫ్ఎస్‌టీ) బృందాలను ఏర్పాటు చేశారు. వీటిలో కూడా అధికారి, ఒక పోలీస్ అధికారి కూడా ఉంటారు. ఎవరైనా డబ్బు, ఇతర బహుమతులు పంపిణీ చేస్తున్నట్లు పోలీస్ కంట్రోల్ రూమ్, లేదా స్టేషన్‌కు ఫిర్యాదు వస్తే పోలీసులు ఎంసీసీ బృందాలకు చేరవేస్తారు. ఎంపీడీవో పర్యవేక్షణలో పోలీసులు ఆయా ప్రాంతానికి వెళ్లి విచారణ చేపడతారు. అక్కడ ఉల్లంఘనలు జరిగినట్లు ఆధారాలు లభిస్తే ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అయిన ఎంపీడీవో వాటిని సీజ్ చేసి పంచనామా రాసి ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేస్తారు. ఆ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేస్తారు. పార్టీల నేతలు, ప్రజలు నేరుగా ఈ ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ బృందాలకు కూడా ఫిర్యాదు చేయవచ్చని పోలీస్ కమిషనర్ రవిశంకర్ తెలిపారు.

ఎన్నికల ప్రచారానికి అనుమతి తప్పనిసరి

మహారాణిపేట : ఎన్నికల ప్రచారానికి కచ్చితంగా అనుమతులు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున స్పష్టం చేశారు. జిల్లా స్థాయిలో జిల్లా ఎన్నికల అధికారి, అసెంబ్లీ నియోజవర్గాలకు సంబంధించి అక్కడి ఆర్.వో.లు అనుమతులు ఇస్తారన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. వివిధ పార్టీల ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఇతర నిబంధనలపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎటువంటి ప్రచారానికైనా దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లోగా అనుమతులు ఇస్తామని, వివరాలన్నీ సక్రమంగా ఉంటే 24 గంటల్లో కూడా అనుమతులు జారీ చేస్తామన్నారు. సువిధ యాప్‌లోగానీ, పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి జిల్లా కలెక్టరేట్ కాంప్లెక్సులో ఏర్పాటు చేసిన సింగిల్ విండో విభాగంలో, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఆయా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో పార్టీల ప్రతినిధులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఏప్రిల్ 14వ తేదీ వరకు కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్ఠ అమలుకు 89 బృందాలు పని చేస్తున్నాయని కలెక్టర్ వెల్లడించారు. ఇప్పటి వరకు జిల్లాలో వివిధ సంఘటనల్లో 15 కేసులు నమోదు చేశామని చెప్పారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి 26 ఫిర్యాదులు నమోదు కాగా 25 ఫిర్యాదులను పరిష్కరించామని వెల్లడించారు. సి.విజిల్ యాప్ ద్వారా 173 ఫిర్యాదులు నమోదు కాగా ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన 130కి నిర్ణీత కాలంలో పరిష్కారం చూపామని పేర్కొన్నారు. 100 నిమిషాల్లో 107 ఫిర్యాదులను పరిష్కరించామని వివరించారు. 31న పోలింగ్ బూత్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రవిరెడ్డి, కృష్ణకాంత్, వివిధ పార్టీల నేతలు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

మహిళా న్యాయవాదిపై అనుచిత వాఖ్యలు

న్యాయవాదిపై కేసు నమోదు

అల్లిపురం: మహిళా న్యాయవాది పట్ల అనుచిత వాఖ్యలు చేసిన లాయర్‌పై రెండో పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాలివీ.. విశాఖ బార్ అసోసియేషన్‌కు చెందిన ఓ మహిళా న్యాయవాది ఓ సాయంకాలం దినపత్రికలో లీగల్ రిపోర్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం సాయంత్రం ఆమె జిల్లా కోర్టు లైబ్రరీ హాల్‌లో ఆ పత్రికకు వార్తను సిద్ధం చేస్తున్నారు. ఆ సమయంలో కొల్లి రామకృష్ణ అనే న్యాయవాది ఆమెను అసభ్య పదజాలంతో దుర్భాషలాడారు. ఆ సమయంలో అక్కడే ఉన్న న్యాయవాదులు రామకృష్ణను వారించి, బయటకు పంపించినప్పటికీ.. ఆయన దూషణలు ఆపలేదు. ఈ పరిణామంతో మనస్తాపం చెందిన ఆమె.. టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజారోగ్యానికి జవసత్వాలు

పేదలు, మధ్య తరగతి ప్రజలు కోరుకునేది చక్కటి విద్య, మెరుగైన వైద్య సేవలు. తాము ఓటు వేసి గెలిపించిన ప్రభుత్వాలు ఆ రెండూ అందించాలని వారు ఆశిస్తారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వారి ఆకాంక్షలు నెరవేరాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా వైఎస్ జగన్ ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆస్పత్రులను నవీకరించింది. వైద్యులు, సిబ్బంది నియామకాలు చేపట్టింది. ఇందుకు ఎంత ఖర్చయినా వెనుకడుగు వేయలేదు. ఈ చర్యలతో ఎంతటి ఖరీదైన వైద్యం అయినా పేదలకు అందుబాటులోకి వచ్చింది. ఇప్పుడు పేదవాడు నిర్భీతిగా ప్రభుత్వాస్పత్రికి వెళ్లి చక్కటి వైద్యం చేయించుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికొస్తున్నాడు. ప్రభుత్వం అంటే ఇలా ఉండాలని జగనన్న సర్కార్‌ను వేనోళ్ల కీర్తిస్తున్నాడు.

- పేదల కోసం ప్రభుత్వ ఆస్పత్రుల ప్రక్షాళన
- పెద్ద ఎత్తున వైద్యులు, స్టాఫ్‌నర్సులు, టెక్నీషియన్ పోస్టుల భర్తీ
- అందుబాటులోకి అత్యాధునిక పరికరాలు
- సత్ఫలితాలిస్తున్న ప్రభుత్వ చర్యలు

మహారాణిపేట : ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే పేద రోగులకు మెరుగైన సేవలందించేందుకు ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది. వైద్య ఆరోగ్య శాఖతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ), పట్టణ ఆరోగ్య కేంద్రాలు (యూపీహెచ్‌సీ), ఆస్పత్రి సేవా కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (సీహెచ్‌సీ), బోధనాస్పత్రులైన కేజీహెచ్, ఘోషాస్పత్రి (వీజీహెచ్), ప్రాంతీయ కంటి ఆస్పత్రి, ఈఎన్‌టీ ఆస్పత్రి, మానసిక వైద్యశాల, అంటురోగుల చికిత్స కేంద్రం (టీబీ)లో అవసరమైన వైద్యులు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, పారా మెడికల్ సిబ్బందిని భర్తీ చేసింది. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులు సంతృప్తిగా తిరిగి వెళ్లాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనకు అనుగుణంగా పోస్టుల భర్తీ జరిగింది.

కేజీహెచ్‌లో రెండో క్యాజువాలిటీ

ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా వాసులకు కూడా పెద్ద దిక్కుగా పేరుగాంచిన కేజీహెచ్ క్యాజువాలిటీలో పడకలు సరిపోవడం లేదు. దీంతో మరో క్యాజువాలిటీ నిర్మించి పేద రోగులకు వైద్య సేవలందించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో రెండో క్యాజువాలిటీ కోసం మొత్తం రూ. 30 లక్షలు వెచ్చించారు. ప్రస్తుతం ఉన్న క్యాజువాలిటీ పక్కనే 15 పడకలతో రెండో క్యాజువాలిటీని ఆధునాతన వైద్య పరికరాలతో నిర్మించి వినియోగంలో తీసుకొచ్చారు.

నూతన సిబ్బంది నియామకం

కేజీహెచ్‌లో ల్యాబ్, మొబైల్ ఎక్స్‌రే యూనిట్, అల్ట్రా స్కానింగ్ వైద్య పరికరాలు సమకూర్చి కొత్త సిబ్బందిని నియమించారు. కోవిడ్ సమయంలో 240 మంది స్టాఫ్ నర్సులు, 25 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, 41 మంది ఇతర సిబ్బందిని నియమించారు. అలాగే సాయంత్రం ఓపీలు, వివిధ వైద్య పరికరాల వినియోగం, మరింత మెరుగైన సేవలందించేందుకు మళ్లీ రిక్రూట్‌మెంట్ చేపట్టారు. 361 మంది స్టాఫ్ నర్సులు, 25 మంది ఎనస్తీషియన్లు, 6 రేడియోగ్రాఫర్ పోస్టులు భర్తీ చేశారు.



వైద్య ఆరోగ్యశాఖలో వైద్యులు, స్టాఫ్ నర్సులు, టెక్నీషియన్లు పారామెడికల్ తదితర 343 పోస్టులను పలు దశల్లో భర్తీ చేశారు.

టీడీపీ హయాంలో 'నో రిక్రూట్‌మెంట్..'

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎక్కడా పోస్టుల భర్తీ జరగలేదని అధికారులు తెలిపారు. ఉద్యోగంలో ఉండి వివిధ కారణాలతో చనిపోయిన వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వడం కూడా కష్టంగా ఉండేదంటున్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పారా మెడికల్ పోస్టులతో పాటు వైద్యుల పోస్టులు కూడా భర్తీ చేశారు.

ఆంధ్రా మెడికల్ కాలేజీతో పాటు ఇతర అనుబంధ బోధానాస్పత్రుల్లో 220 పోస్టులు భర్తీ చేశారు. శొంఠ్యాంలో ఆయుర్వేద ఫార్మసీ అండ్ డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్ నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. విమ్స్‌లో 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆస్పత్రి నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. వీటిలో పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు తయారు చేశారు.

పట్టణ పరిధిలో కూడా..

జీవీఎంసీ పరిధిలో ఆధునికీకరించిన 63 డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (యూపీహెచ్‌సీలు) వైద్యులు, పారా మెడికల్, ఇతర సిబ్బందిని నియమించారు. ఇక్కడికి వచ్చే రోగులను పరీక్షించడానికి ఒక ఎంబీబీఎస్ వైద్యుడు నిత్యం అందుబాటులో ఉండేలా, ప్రతిరోజు ఒక స్పెషలిస్టు డాక్టర్ వచ్చి సేవలందించేలా ప్రోగ్రాం చార్ట్ డిజైన్ చేశారు. ఇందుకోసం 60 వైద్య పోస్టులు కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేశారు. 120 మందికి పైగా ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులను నియమించారు.

104/108 వాహనాల్లో కూడా..

గతంలో కొన్ని ప్రాంతాలకే పరిమితమైన 104, 108 వాహనాలను ఇప్పుడు అన్ని ప్రాంతాలకు విస్తరించారు. సత్వర వైద్య సేవల కోసం 40 కొత్త 104 వాహనాలు, 30 నూతన 108 వాహనాలు విశాఖకు కేటాయించారు. వీటికి అవసరమైన సిబ్బంది నియామకం కూడా చేపట్టారు. తాత్కాలికంగా సేవలందిస్తున్న వారిని రెగ్యులర్ చేయడంతో సుమారు 30 మంది కొత్తవారికి ఉపాధి లభించింది.

భారీ ఎత్తున నియామకాలు



రోగులకు సత్వరం నాణ్యమైన సేవలందించాలని ప్రభుత్వం పెద్ద ఎత్తున పోస్టులు భర్తీ చేసింది. అన్ని యూపీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో కూడా వైద్యులను నియమించింది. అవసరమైన మేరకు పారా మెడికల్ సిబ్బంది నియామకాలు కూడా జరిగాయి. పేదలు వైద్య సేవలు పొందే విషయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంది.

– పి.జగదీశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

రోగులకు చక్కటి సేవలు



పేద రోగులకు కేజీహెచ్‌లో చక్కటి సేవలు అందించగలుగుతున్నాం. రోగులకు అందజేసే సేవల్లో ఎలాంటి ఆటంకాలు ఉండకూడదని ప్రభుత్వ అనుమతితో అనేక పోస్టులు భర్తీ చేశాం. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండటం వల్ల రోగులకు చక్కటి సేవలందించగలుగుతున్నాం.

– డాక్టర్ పి.అశోక్‌కుమార్, సూపరింటెండెంట్, కేజీహెచ్

ఏయూ అభివృద్ధిని చూసి ఓర్వలేకే అసత్య ఆరోపణలు

- యూనివర్సిటీలో చదువుకునేది పేద, మధ్య తరగతి విద్యార్థులే..
- వీరి కోసం క్రీడా మైదానాలు అభివృద్ధి చేయడం తప్పా?
- విద్యార్థుల ప్రయోజనాలకు రాజకీయాలు ముడిపెట్టడం సరికాదు
- ఏయూ జేఏసీ అధ్యక్షుడు డాక్టర్ జి.రవికుమార్

విశాఖ సిటీ: పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను అందిస్తూ.. జాతీయ స్థాయిలో అత్యుత్తమ విశ్వవిద్యాలయంగా నిలిచిన ఆంధ్రా యూనివర్సిటీ అభివృద్ధిని చూసి ఓర్వలేకే అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఏయూ జేఏసీ అధ్యక్షుడు డాక్టర్ జి.రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏయూ ప్రతిష్టకు భంగం కలిగించేలా జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ మీడియా సమావేశంలో చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆయన ఒక ప్రకటనలో ఖండించారు. నగరానికి చెందిన ఒక ప్రముఖ ప్రైవేట్ విద్యా సంస్థకు వత్తాసు పలుకుతూ, ప్రభుత్వ విద్యా సంస్థ ఏయూను టార్గెట్ చేయడం సమంజసం కాదని హితవుపలికారు. ఏయూ అభివృద్ధి, ప్రగతిని చూసి ఓర్వలేక.. ప్రైవేటు విద్యాసంస్థ యజమాని వెనుక ఉండి నడిపిస్తున్నారనే సందేహం కలుగుతోందన్నారు. గతంలో ఈ ప్రైవేటు విశ్వవిద్యాలయానికి చైర్మన్‌గా పనిచేసిన వ్యక్తి ఏయూని దెయ్యాల కొంపగా వాఖ్యానించడాన్ని ఇంకా మరువలేదన్నారు. ప్రస్తుతం ఎంపీగా పోటీలో ఉన్న ఆయన మనవడు.. ఆంధ్రా యూనివర్సిటీ ప్రతిష్టను దిగజార్చే విధంగా మూర్తి యాదవ్‌తో ఆరోపణలు చేయిస్తున్నారని బలంగా నమ్ముతున్నామని చెప్పారు.

విద్యార్థుల కోసం క్రీడా మైదానం అభివృద్ధి చేస్తుంటే..

యూనివర్సిటీ విద్యార్థులకు క్రీడలకు ఉపయుక్తంగా ఇంజనీరింగ్ కాలేజీ మైదానాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. గతంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన ఈ స్థలాన్ని క్రీడా మైదానంగా అభివృద్ధి చేసి క్రీడా సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. ఇందుకోసం అవసరమైన మట్టిని వేయడంతో పాటు మైదానం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపడున్నారని వెల్లడించారు. ఈ నిర్మాణాలకు అవసరమైన మట్టి, రాయి వంటివి పలువురు దాతలు స్వచ్ఛందంగా ఉచితంగా ఏయుకు అందిస్తున్నారని వివరించారు. ఏయూపై ఎటువంటి ఆర్థిక భారం పడకుండా దాతల సహకారంతో విద్యార్థుల కోసం క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేస్తుంటే.. కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ తప్పుబడుతూ ప్రైవేటు యూనివర్సిటీ యజమానిని ఎంపీగా గెలిపించడానికి రాజకీయ కోణంలో ఆరోపణలు చేయడం ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. ఏయూలో జరుగుతున్న అభివృద్ధిపై విద్యార్థులు, తల్లిదండ్రులు, నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తుంటే.. కార్పొరేటర్ ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు కొమ్ము కాసే విధంగా వాఖ్యలు చేసున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా మూర్తి యాదవ్ తన వైఖరిని మార్చుకొని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అభివృద్ధిని స్వయంగా వీక్షించి తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇదే విధమైన అసత్య, దిగజారుడు వ్యాఖ్యలు చేస్తే విశ్వవిద్యాలయ ఉద్యోగులు, విద్యార్థులు దీనిపై తీవ్రంగా స్పందించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన యువకులతో వాసుపల్లి గణేష్‌కుమార్



చిలకపేటకు చెందిన వారితో వాసుపల్లి గణేష్‌కుమార్



కాంగ్రెస్ నాయకులకు వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎంవీవీ సత్యనారాయణ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనకు ఆకర్షితులైన జనసేన, కాంగ్రెస్ నాయకులు గురువారం భారీగా వైఎస్సార్ సీపీలోకి చేరారు.

అల్లిపురం: జీవీఎంసీ 38వ వార్డుకు చెందిన సుమారు 100 మంది జనసేన నాయకులు గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ మండల అధ్యక్షురాలు కొల్లి సింహాచలం ఆధ్వర్యంలో చేరిన వీరికి దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ పార్టీలో చేరిన యువకులు కోరిన విధంగా మరుగుదొడ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జనసేన నాయకులు మాట్లాడుతూ వాసుపల్లి గణేష్‌కుమార్ చేస్తున్న ప్రజాసేవకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వెల్లడించారు. ఈ ఎన్నికల్లో వాసుపల్లి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కల్యాణ్ పోలవరపు, గొరక అనిల్‌కుమార్, సతీష్, వడిసల సతీష్‌కుమార్, నీలి సతీష్‌కుమార్ తదితరులు పార్టీలో చేరారు. అలాగే 38వ వార్డుకు చెందిన మరో 68 కుటుంబాలు కొల్లి సింహాచలం ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. వీరికి వాసుపల్లి గణేష్‌కుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ చిలకపేటలో ఇళ్ల నిర్మాణ సమయంలో నెల రోజుల పాటు భోజనాలు అందించి, ఇంటి అద్దెలు కూడా వాసుపల్లి చెల్లించారని గుర్తు చేశారు. ప్రజల డిమాండ్ మేరకు గేటెడ్ కమ్యూనిటీ భవనం నిర్మించి ఇచ్చారన్నారు. చేసిన సేవలే అతన్ని మళ్లీ గెలిపిస్తాయన్నారు.

కాంగ్రెస్ నాయకులను ఆహ్వానించిన ఎంవీవీ

ఆరిలోవ: కాంగ్రెస్ యూత్ జనరల్ సెక్రటరీ పల్లా వెంకటేష్‌కుమార్ యాదవ్, మనూ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు పల్లా మనుతో పాటు ఆరిలోవ, హెచ్‌బీకాలనీ, లాసన్స్‌బే కాలనీ, ఎంవీపీకాలనీల నుంచి సుమారు 100 మంది కాంగ్రెస్ నాయకులు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. లాసన్స్‌బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకుడు గంపల వెంకటరామచంద్రరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడేవారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం వారు రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి సత్కరించారు. గన్నమనేని వెంకటేశ్వరరావు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు పాల్గొన్నారు.

నగరంలో నిరంతర నిఘా

- ప్రశాంత ఎన్నికలకు నిబద్ధతతో వ్యవహరించాలి
- పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

విశాఖ సిటీ: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు నగరంపై నిరంతర నిఘా పెట్టాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం పోలీస్ సమావేశ మందిరంలో డీసీపీలతో కలిసి లీగల్ అడ్వైజర్, ఏడీసీపీల నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్, క్రైమ్, లా అండ్ ఆర్డర్, స్పెషల్ బ్రాంచ్‌లకు వేర్వేరుగా సమీక్షించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద అక్రమ మద్యం, నగదు, ఇతర అనుమానిత వస్తువులను పూర్తిగా నివారించేలా అన్ని వాహనాలను తనిఖీ చేయాలన్నారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో బైండోవర్ చేసిన రౌడీ షీటర్లపై నిఘా పెట్టాలని తెలిపారు. సీసీ టీవీ కెమెరాలు ప్రతి ఎస్‌హెచ్‌వో తమ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో ఏర్పాటు చేసే విధముగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పూర్తి నిబద్ధతతో పనిచేయాలన్నారు. నగరంలో అన్ని పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు, అధికారులు ఫిర్యాదుదారులతో ప్రవర్తిస్తున్న తీరుపై ఆరా తీశారు. మహిళల భద్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, మహిళలపై వేధింపులు, మిస్సింగ్ సంబంధిత కేసుల్లో జాప్యం లేకుండా తక్షణమే స్పందించాలన్నారు. నగరంలో క్రైమ్ రేటు తగ్గు ముఖం పట్టేలా రాత్రి పూట నిఘా మరింత పటిష్టం చేయాలని తెలిపారు. రాత్రి విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ ట్యాబ్ తీసుకొని తమ లొకేషన్ తెలిసే విధంగా ఉండాలన్నారు. పెండింగ్ కేసులు, అందుకు గల కారణాలను తెలుసుకున్నారు. వాటిని సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.

మార్మోగిన వేదమంత్రాలు

- పులకరించిన సింహగిరి
- శాస్త్రోక్తంగా రెండవ రోజు సుదర్శన నారసింహ మహా యజ్ఞం
- పాల్గొన్న దేవదాయశాఖ కమిషనర్, జీవీఎంసీ కమిషనర్



యజ్ఞంలో పెద్ద ఎత్తున పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: సింహగిరిపై శ్రీ సుదర్శన నారసింహ మహా యజ్ఞం రెండవ రోజు గురువారం వైభవంగా కొనసాగింది. శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం కూడా కలసి రావడంతో యజ్ఞంలో పెద్ద ఎత్తున ఉభయదాతలు పాల్గొన్నారు. వేదమంత్రాలతో సింహగిరి పులకరించింది. ఉదయం స్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఓ పల్లకీలో, చక్రపెరుమాళ్‌ను ఓ పల్లకీలో అధిష్టింపజేసి ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న యజ్ఞశాలలోకి తిరువీధిగా తీసుకొచ్చారు. యజ్ఞశాలలో చక్రపెరుమాళ్‌ను ఓ వేదికపై, మరొక వేదికపై స్వామి ఉత్సవమూర్తులను అధిష్టింపజేశారు. వేద మంత్రోచ్చరణలు పఠిస్తూ యజ్ఞాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో పూర్ణాహుతి నిర్వహించారు. పూర్ణాహుతి ప్రసాదాన్ని యజ్ఞంలో పాల్గొన్న ఉభయదాతలు, భక్తులకు అందజేశారు. అనంతరం స్వామి ఉత్సవమూర్తుల చెంతన రామాయణం, భాగవతం, విష్ణుపురాణం, నృసింహ సహస్రనామం, దివ్యప్రబంధం, క్షేత్ర మహత్యం, సుదర్శన శతకాలను వైదికులు పారాయణం చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు దేవస్థానం తరపున శాలువా, రవిక, కల్యాణం లడ్డూ, పులిహోర ప్రసాదం, అప్పన్న స్వామి రాగి ప్రతిమ అందజేశారు. ప్రత్యేకంగా భోజన సదుపాయం కల్పించారు. యజ్ఞం తిలకించేందుకు వచ్చిన భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేశారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మహాయజ్ఞంలో రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పాల్గొన్నారు. ఈవో వారికి స్వామి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.





యజ్ఞంలో పాల్గొన్న దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

బార్ అసోసియేషన్ ఎన్నికలకు ఏర్పాట్లు

- అభ్యర్థుల తుది జాబితా ప్రకటన
- ఈసీగా పద్మారాణి ఏకగ్రీవ ఎన్నిక

విశాఖ లీగల్: విశాఖ న్యాయవాదుల సంఘం ఎన్నికలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వచ్చే నెల 4న జరిగే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితాను గురువారం ఎన్నికల ప్రధాన అధికారి కేశ ప్రగడ వెంకట నరసింహమూర్తి ప్రకటించారు. న్యాయవాదుల సంఘం చరిత్రలోనే తొలిసారిగా ప్రతీ పదవికి పోటీ ఏర్పడింది. అధ్యక్ష స్థానానికి నలుగురు, ఉపాధ్యక్ష స్థానానికి ఏడుగురు, ప్రధాన కార్యదర్శికి ఆరుగురు, సంయుక్త కార్యదర్శికి ఇద్దరు, కోశాధికారికి ముగ్గురు, క్రీడా సాంస్కృతిక కార్యదర్శికి నలుగురు, మహిళా ప్రతినిధికి ముగ్గురు, సీనియర్ సభ్యులకు నలుగురు, జూనియర్ సభ్యులకు 16 మంది పోటీ చేస్తున్నారు. కాగా.. సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యురాలిగా సీనియర్ న్యాయవాది డి.పద్మారాణి ఎన్నికయ్యారు. ఈ స్థానానికి పోటీ చేస్తున్న న్యాయవాది తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో.. ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సహాయ ఎన్నికల అధికారి ఎం.కె.శ్రీనివాస్ ప్రకటించారు. పద్మారాణి 1992 నుంచి న్యాయవాదిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు న్యాయవాదులు, బార్ కౌన్సిల్ సభ్యులు అభినందించారు. మహిళా విభాగంలో సీనియర్ సభ్యురాలిగా ఎస్.అమరావతి కూడా ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే.

